ఫాగింగ్ పేరిట దోపిడీ!

- నగరంలో నామమాత్రంగా ఫాగింగ్
- పెట్రోల్, డీజిల్ వాడకంపై లెక్కలు కరువు
- దోమలతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

నిజామాబాద్ నాగారం: నగరంలో దోమలు ప్రజల రక్తాన్ని పీలుస్తుంటే.. కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు ఫాగింగ్ పేరిట ప్రజాధనాన్ని తాగేస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయకున్నా చేసినట్లు చూపి డబ్బులు తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఫాగింగ్‌కు సంబంధించి లెక్కలు లేకపోవడం గమనార్హం. నిజామాబాద్ నగరంలో 60 డివిజన్లు ఉన్నాయి. 95 వేల నివాసాలు, నాలుగు లక్షలకు పైగా జనాభా ఉంది. శానిటేషన్ విభాగానికి ఆరు జోన్ కార్యాలయాలున్నాయి. నాందేవాడ, గోల్ హనుమాన్, పెద్దబజార్, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, కంఠేశ్వర్, అర్సపల్లిలో జోన్ కార్యాలయాలున్నాయి. ఒక్కో జోన్ పరిధిలో 8 నుంచి 10 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌లో నాలుగు నుంచి ఐదు కాలనీలున్నాయి. ప్రతి నిత్యం దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీల్లో దోమల బెడద నిర్మూలించడానికి ఫాగింగ్ చేయాలి. 3 నుంచి 5 లీటర్ల డీజిల్, రెండు లీటర్ల చొప్పున పెట్రోల్ కలిపి నిత్యం ఫాగింగ్ చేయిస్తున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ నగరంలోని ఏ డివిజన్‌లో కూడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు.





జోన్ కార్యాలయంలో ఉన్న ఫాగింగ్ మిషన్, స్ప్రేయర్

15 రోజులకు ఒకసారి చేయాలి

నిబంధనల ప్రకారం ఒక్క సారి ఫాగింగ్ చేస్తే 15 రోజులకు మళ్లీ ఒక్కసారి వచ్చి ఫాగింగ్ చేయాలి. ఆరు నెలలు దాటిన ఫాగింగ్ చేయడానికి రావడం లేదని ప్రజలే చెప్పుతున్నారు. నగరంలోని ఆయా డివిజన్లు, కాలనీల్లో మురుగుకాలువల్లో, ఖాళీ స్థలాల్లో నిలిచి ఉన్న ప్రాంతాల్లో ఖచ్చితంగా ఫాగింగ్, స్ప్రే, ఆయిల్ బాల్స్ వేయాల్సి ఉంటుంది. ఎక్కడ కూడా ఫాగింగ్ చేస్తున్న ఘటనలు కనిపించడం లేదు. నగరంలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆచరణలో ఎక్కడ కూడా ఫాగింగ్ చేసిన్నట్లు కనిపించడం లేదు. ఫాగింగ్ చేయడానికి ఒక్కో జోన్‌కు డీజిల్, పెట్రోల్, ఆయిల్‌బాల్స్, స్ప్రేలకు సంబంధించి ఎన్ని లీటర్లు ఖర్చు చేస్తున్నామనేది కచ్చితమైన లెక్కలు లేకుండా పోయాయి. ఫాగింగ్‌కు డీజిల్, పెట్రోల్ నెలకు ఎంత వాడుతున్నాం, ఖర్చు ఎంత అని వివరాలు ఉండాలి. సంబంధిత అధికారుల వద్ద మాత్రం ఫాగింగ్‌కు ఎంత ఖర్చు చేస్తున్నామో వివరాలు లేకపోవడం గమనార్హం.

పట్టించుకోని అధికారులు

శానిటేషన్‌కు ఇన్‌చార్జి అధికారి ఉండడంతో సరైన పర్యవేక్షణ లేకుండా పోయింది. ఫాగింగ్‌కు ఎన్ని లీటర్ల డీజిల్, పెట్రోల్ వాడుతున్నామో కచ్చితమైన సమాచారం లేకున్నా పట్టించుకోవడం లేదు. కమిషనర్ ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఫాగింగ్ లెక్కలు బయటకు వస్తాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజీద్ అలీకి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

క్లుప్తంగా

వసతి గృహాలను నిర్మించాలని వినతి



సుభాష్‌నగర్: ప్రభుత్వ గిరిరాజ్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు సరిపడా వసతి గృహాలను నిర్మించాలని పీడీఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాకు వినతిపత్రం అందజేశారు. నగర అధ్యక్షుడు ఎస్కే అషూర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు నిజామాబాద్ నగర కేంద్రంగా ఉన్న ప్రభుత్వ గిరిరాజ్, పాలిటెక్నిక్ కళాశాలకు చదువు నిమిత్తమై వస్తున్నారన్నారు. వారికి సరిపడా హాస్టల్స్ లేకపోవడం బాధాకరమన్నారు. బాల బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతి గృహాలను త్వరితగతిన ఉపయోగంలోకి తేవాల్సిందిగా డిమాండ్ చేశారు. నాయకులు తిరుమలేష్, నాగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఖలీల్‌వాడి: పార్లమెంట్‌లో ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ నగరంలోని ధర్నాచౌక్‌లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ.. పార్లమెంటు సమావేశాల్లో ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న ఎంపీలను సస్పెన్షన్ చేయడం అనైతికమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, భూమయ్య, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, నాయకులు సుజాత, పెద్ది సూరి, శివకుమార్, గణేశ్, అంజలి, ఇమ్రాన్ అలీ, హనుమాన్లు, రాధాకుమార్, అమర్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవ పోస్టర్లను శుక్రవారం నాందేవ్‌వాడలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ నెల 29న రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో హృదయ స్పందన పేరిట వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు గంగాధర్, వాల బాలకిషన్, వినయ్‌కుమార్, చందా జగన్‌మోహన్, సుమీల శర్మ, సుజాత రెడ్డి, జయదేవ్, మయూర్, చందూ, దినేష్ పాల్గొన్నారు.

మోపాల్ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం



మోపాల్: మోపాల్ సొసైటీ చైర్మన్ ఉమాపతిరావుపై అవిశ్వాసం పెడుతు సభ్యులు శుక్రవారం డీసీవో సింహాచలంకు లేఖను అందజేశారు. 11 మంది సభ్యుల సంతకాలతో కూడిన లేఖను ఆయనకు అందజేశారు. జనవరి 17న సొసైటీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపినట్లు సభ్యులు పేర్కొన్నారు. కాగా మోపాల్ సొసైటీ చైర్మన్ పదవి కోసం ఇద్దరు పోటీపడుతున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో సభ్యులు గంగారెడ్డి, సతీష్‌రెడ్డి, రాజశేఖర్, చిన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నానోసింగ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు



సిరికొండ: జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిరికొండ కేజీబీవీ విద్యార్థినులు పది పతకాలు సాధించినట్లు పీఈటీ స్వప్న తెలిపారు. అండర్-16 విభాగంలో జావెలిన్ త్రోలో హిందు పసిడి పతకం, మౌనిక రజతం, శిరీష కాంస్య పతకం, హై జంప్‌లో హారిక రజతం, కౌసల్య కాంస్యం, అండర్-14 జావెలిన్ త్రోలో మధుప్రియ పసిడి, లక్ష్మి రజతం, గాయత్రి కాంస్యం, హై జంప్‌లో అంజలి పసిడి, సంధ్యారాణి కాంస్య పతకం సాధించినట్లు పీఈటీ తెలిపారు.

ఘనంగా గణిత దినోత్సవం

సాక్షి, నెట్‌వర్క్: నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో పలు పాఠశాలల్లో శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామనుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా గణితంపై విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు.



సిరికొండ ఆదర్శ పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గూపన్‌పల్లిలో గణిత ఉపాధ్యాయులకు సన్మానం



మంచిప్పలో మాట్లాడుతున్న ప్రేమ్‌లాల్



నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలలో..



ధర్పల్లి లిటిల్ హార్ట్స్ పాఠశాలలో ..



నల్లవెల్లి శ్రీజ్ఞాన సరస్వతి పాఠశాలలో..

బలమైన పార్టీ నిర్మాణానికి కృషి

ఖలీల్‌వాడి: బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. శుక్రవారం నగరంలోని గాయత్రీనగర్ వెంకటేశ్వర కల్యాణ మండపంలో సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగారావు మాట్లాడుతూ పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరి ఇన్సియేటివ్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీలు విలీనం అవుతున్నట్లు తెలిపారు. 2024 మార్చ్ 3,4,5 తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐక్యతా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఈ ఐక్యత సభ ఒక ముందడుగుగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. నాయకులు కేజీ రామచందర్, కెరమ, వి ప్రభాకర్, ఎం నరేందర్, పి రామకృష్ణ, ఎం వెంకన్న, డి రాజేశ్వర్, ఎం సుధాకర్, ఎం ముత్తెన్న, గంగాధర్, మల్లేష్, సాయగౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోటు రంగారావు

స్నేహ సొసైటీలో క్రిస్మస్ వేడుకలు

నిజామాబాద్ నాగారం: నగరంలోని స్నేహ సొసైటీలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు హాజరై మాట్లాడారు. కులమతాలకు అతీతంగా స్నేహ సొసైటీలో పండుగలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన బస్సును ప్రారంభించారు.మేయర్ దండు నీతూకిరణ్, ప్రిన్సిపాల్ జ్యోతి,వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

పిల్లలను చట్టపరంగా దత్తత తీసుకోవాలి

డిచ్‌పలి: పిల్లలు లేని దంపతులు చట్టపరంగా దత్తత తీసుకోవాలని అప్పుడే ఎలాంటి సమస్యలు రావని జిల్లా సంక్షేమ అధికారి (ఐసీడీసీ పీడీ) రసూల్ బీ సూచించారు. శుక్రవారం డిచ్‌పల్లిలోని మానవత సదన్‌లో మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ, వేర్‌ఆర్ ఇండియాస్ చిల్డ్రన్స్ సంస్థ సంయుక్తంగా దత్తత ప్రక్రియపై నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. దత్తత ఎలా తీసుకోవాలనే విషయమై వేర్ ఆర్ ఇండియాస్ చిల్డ్రన్ సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోష్ శిక్షణ నిచ్చారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌కేర్ ఇన్స్టిట్యూషన్స్ సిబ్బంది హాజరయ్యారు. బాలల పరిరక్షణ అధికారులు చైతన్యకుమార్, స్రవంతి, బాలరక్ష భవన్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి, మానవత సదన్ కేర్‌టేకర్ రమేశ్ పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి

లింగ వివక్షను రూపు మాపాలని అని జిల్లా సంరక్షణాధికారి (ఐసీడీఎస్ పీడీ) ఎస్కే రసూల్‌బీ అన్నారు. జిల్లా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆశవర్కర్స్, మహిళా సమాఖ్య సభ్యులకు నడిపల్లి రైతువేదికలో శుక్రవారం బేటీ బచావో.. బేటీ పడావోపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. సీడీపీవో స్వర్ణలత, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుజ్జి, శ్రీప్రియ, సరిత, ఐకేపీ ఏపీఎం రజిత, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి వైశంకర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంరక్షణాధికారి రసూల్‌బీ

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

డిచ్‌పల్లి: గతంలో రూ.వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు వాటిని ఆన్‌లైన్‌లో క్రమబద్ధీకరణ చేసుకోవాలని డిచ్‌పల్లి ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండలంలోని నడిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎంపీవో మాట్లాడుతూ.. జిల్లాలోనే అత్యధికంగా నడిపల్లి పంచాయతీ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 2,310 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో ఇప్పటి వరకు 370 మంది ప్లాట్ల యజమానులు మాత్రమే ఆన్‌లైన్‌లో క్రమబద్ధీకరణ చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన వారు తమ ప్లాట్ డాక్యుమెంట్లు, ఈసీ, మార్కెట్ వాల్యు తీసుకుని వచ్చి గ్రామపంచాయతీలో ఆన్‌లైన్ దరఖాస్తు చేయించాలన్నారు. క్రమబద్ధీకరణ చేసుకుంటే ఆ ప్లాట్లపై ఇంటి నిర్మాణం కోసం అనుమతితో పాటు బ్యాంకు రుణం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రజత్‌కుమార్, బిల్ కలెక్టర్లు రాము, సంతోష్, సిబ్బంది బాబా పాల్గొన్నారు.



నడిపల్లిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్

జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక

నిజామాబాద్ అర్బన్: జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఏడో తరగతి విద్యార్థులు కార్తికేయ రాథోడ్, హర్షిత ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రాంతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌లో కమ్యూనికేషన్-ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంలో 'స్మార్ట్ బైక్- హెల్మెట్ సిస్టం' నమూనాను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన జనవరిలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయికి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మారయ్యగౌడ్ తెలిపారు. కాగా శుక్రవారం విద్యార్థులను పాఠశాల చైర్మన్, డైరెక్టర్ హరితగౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్ తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జక్రాన్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బ్రహ్మానందం సూచించారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల్లో కేంద్రం ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువురిని ఎంతగానో ఆకుట్టుకున్నాయి. సర్పంచ్‌లు మాదరి లత దేవరాజ్, సురేష్, ఏపీఎం రవీందర్, సీసీ రవి, ఏపీవో రవి, ఏవో దేవిక, మండల పశువైద్యాధికారిణి శిరీష, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉషా పవనాలు పుస్తకావిష్కరణ

జక్రాన్‌పల్లి: ప్రముఖ రచయిత, గోర్తి ఈశ్వర ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఉషాబాల రాసిన 'ఉషా పవనాలు' పుస్తకాన్ని జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీపీఎస్ విద్యా సంస్థల అధిపతి అమృత లత, లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, అట్లూరి రమాదేవి, గంగాధర్, పాఠశాల హెచ్ఎం మురళి పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి తైక్వాండోలో ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి జునేరా హుసేన్ రజత పతకం సాధించింది. తాండూర్‌లో శుక్రవారం జరిగిన పోటీల్లో క్యూరేస్ అకాడమీకి చెందిన జునేరా హుసేన్ అండర్-14 విభాగంలో రజతం గెలుచుకుంది. ఆమెను కోచ్ వినోద్‌నాయక్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సంగీత్‌రావు అభినందించారు.

వర్సిటీలో మానవ సంఘీభావ దినోత్సవం



తెయూ(డిచ్‌పల్లి): ప్రపంచమంతా స్వేచ్ఛ, సమానత్వం, శాంతి చేకూరాలని ప్రజలందరూ ఐక్యమతంగా ఉండాలని తెలంగాణ వర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి కె.అపర్ణ పేర్కొన్నారు. శుక్రవారం తెయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ సంబంధాలను కాపాడుకోవాలని, మానవ సంబంధాల విలువల్ని గొప్పతనాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ ఆంజనేయులు, డాక్టర్ పాత నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ చోరీకి యత్నం

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లిలో శుక్రవారం ఉదయం బైక్ దొంగతనానికి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	26	గాజరుగడ్డ	40	60
బెండకాయ	60	90	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	60	90	దోసకాయ	20	40
దొండకాయ	45	75	ఆలుగడ్డ	16	35
బీర్నీసుకాయ	50	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	60	80
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

- సుభాష్‌నగర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,850	వెండి (కిలో)	77,600
22 క్యారెట్స్	57,950		

- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	డంకీ(హిందీ) 9.30, 4.15, 10.30 హాయ్ నాన్న(తెలుగు) 7.25
స్క్రీన్-3	సలార్(తెలుగు) 9.25, 12.45, 4.05, 7.25, 10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సలార్(తెలుగు) 8.00, 11.35, 3.10, 6.45, 10.20
స్క్రీన్-2	సలార్(తెలుగు) 8.30, 12.05, 3.40, 7.15, 10.50
స్క్రీన్-3	సలార్(తెలుగు) 6.40, 11.00 ఆక్వామెన్2(ఇంగ్లీష్-3డీ)-10.15,8.15 హాయ్ నాన్న(తెలుగు)-1.00 యానిమల్(తెలుగు)-4.15
స్క్రీన్-4	డంకీ(హిందీ) 9.20, 12.40, 4.00, 7.20, 10.40
దేవి	సలార్(తెలుగు)
నటరాజ్	యానిమల్(హిందీ)
లలితామహల్	సలార్(తెలుగు)
విజయ్	సలార్(తెలుగు)

29న నియోజకవర్గస్థాయి క్రిస్మస్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలో ఈ నెల 29న నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాలకు చెందిన పాస్టర్లతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. డిచ్‌పల్లి కేఎన్ఆర్ గార్డెన్స్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామన్నారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి తహసీల్దార్ రాజేందర్, ఆర్ఐలు సంతోష్, భూపతిప్రభు తదితరులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శన

నిజామాబాద్‌అర్బన్: జనవరి 18, 19 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్ఎంలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇందులో 24 ప్రధాన అంశాలు ఉంటాయని పేర్కొన్నారు. డీఎడ్, బీఎడ్ విద్యార్థులు కూడా ఆవిష్కరణలతో బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించవచ్చని తెలిపారు. త్వరలోనే అన్ని మండలాల విద్యాశాఖ అధికారులకు లింకు పంపిస్తామని వివరించారు. వివరాలకు 9848219365 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.